# సర్కారీ మిలిటెంట్ల భస్మాసుర పాత్ర

పౌరహక్కుల సంఘం నాయకుడు పురుషోత్తంను హత్య చేసిన మాజీ నక్సలైట్లతో తమకు సంబంధం అంటగట్టడం అన్యాయమంటూ రాష్ట్ర పోలీసు యంత్రాంగం వ్యక్తం చేసిన తీవ్రమైన నిరసన తన లక్ష్యాన్ని సాధించిందా?

వాళ్ళెవరో చంపితే పోలీసులను అనవసరంగా అంటున్నారు అని ప్రజలను నమ్మించగలిగిందా? కొంతమందయినా నమ్మే ఉంటారు. సమాజంలోని ప్రతి నేరస్థుడి గురించీ ఎప్పటికప్పుడు తెలుసుకోవడం పోలీసు యంత్రాంగానికి సాధ్యం కాదు కాబట్టి, 'వీళ్లిట్లా తయారయ్యారని మాకు తెలీదే! ఇంక వీళ్ళ ఆటలు సాగనివ్వం' అన్న డి.జి.పి దొరగారి ప్రకటన అబద్ధమని కొట్టిపారేయడానికి వీలు లేదనే వాళ్ళూ ఉంటారు.

ఇది నిజమైతే అందరమూ సంతోషించేవారమే. కానీ నిజం కాదని నమ్మడానికి కనీసం మూడు కారణాలున్నాయి.

ఒకటి, పురుషోత్తం హత్యకు ముందురోజు అతని హంతకులయిన నయీముద్దీన్ అండ్ కంపెనీ భువనగిరిలో రోడ్డు మీద కనిపించారు. వాళ్ళతోబాటు సాయుధులైన పోలీసులున్నారు. (సరసనే ఒక పోలీసు జీపు కూడ కనిపించిందంటారు.) అంటే పోలీసుల కళ్ళు కప్పి కాదు, పోలీసులను వెంబడి పెట్టుకునే వారు సంచరిస్తున్నారని అర్థం. రెండు, వాళ్ళను అరెస్టు చేసి కోర్టులో హాజరు పెట్టినపుడు పెద్దసంఖ్యలో యువకులు వారిని చుట్టుముట్టి వారి పైన పూలు జల్లారు, నినాదాలు యిచ్చారు. వారంతా నయీముద్దీన్, సమ్మిరెడ్డి వగైరాల కోవకు చెందిన దిగజారిన మాజీలేనని పోలీసులు అన్నప్పటికీ ఆ గుంపులో మఫ్టీ పోలీసులూ ఉన్నారని గుర్తుపట్టగల వారంటారు.

మూడు, పోలీసు కస్టడీలో ఉన్న పురుషోత్తం హంతకుల ముఖాలలో ఏ విచారమూ లేకపోగా, అతనిని తామే హత్య చేశామని వాళ్ళు టి.వి కెమెరాల ముందు నిర్భయంగా చెప్పారు. ఇంకొంత మందిని హత్య చేసేది కూడ ఉందని కోర్టులో తమను చుట్టుముట్టిన అభిమానులతో అన్నారు. పోలీసుల కస్టడీలో ఉంటూ ఇంకా హత్యలు చేయబోతామని బిగ్గరగా చెప్పడం చిన్న విషయం కాదు. పోలీసుల మిత్రత్వమే లేకపోతే టి.వి చానెల్స్ కు ఇచ్చిన 'ఒప్పుకోలు', కోర్టులో చేసిన ఈ ప్రకటన వారిని చాలా ఇబ్బంది పెట్టగలవు.

వీళ్ళిద్దరి సంగతి అట్లా వుండగా, వీరి తలదన్నే ఘనుడు కత్తుల సమ్మయ్య పోలీసుల కనుసన్నలలోనే మెలుగుతాడనేది వరంగల్, కరీంనగర్ జిల్లాలలో అందరికీ

తెలిసిన సంగతే. అతను ఆయుధం పక్కన పెట్టుకొని పంచాయతులు చేస్తుంటాడు. ఆ పంచాయతులకు అతను పోలీసు జీపులో వచ్చి పోయిన ఉదంతాలు కూడ వున్నాయి.

సంగతి బయటికి పొక్కేసరికి తమ జేబులో వున్న హంతకులను పోలీసులు 'అరెస్టు' చేసి 'ఛీ! వీళ్ళింతగా దిగజారిపోయారా! మాకు తెలీదే' అంటూ అమాయకత్వం నటిస్తున్నారు గానీ, ఆంధ్రప్రదేశ్ పోలీసు యంత్రాంగం గురించి తెలిసిన వారెవ్వరూ ఇందులో నిజమైన అమాయకత్వం వుందని గానీ, నిజమైన పశ్చాత్తాపం వుందని గానీ నమ్మరు. అది కరడుగట్టిన జాతి. దానికి ఫలితాలే తప్ప వేరే ప్రమాణాలు తెలియవు.

తమ చేతి కింద 'మాజీల'తో రూపొందిన కిరాయి హంతక ముఠా ఉండడం చాలా చాలా ప్రయోజనకరమనేది మిలిటెంట్ ఉద్యమాలున్న అన్ని ప్రాంతాలలోనూ ప్రభుత్వ సాయుధ బలగాలు గ్రహించిన సత్యం. అంత విలువైన సత్యాన్ని వారు ఒక పట్టాన చేజారనివ్వరు. పురుషోత్తం హత్య తరువాత మన పాలకులు చేసిన ప్రకటనల లాంటివి కాశ్మీర్ లోనూ, అస్సాంలోనూ ప్రజలు తరచుగా వింటుంటారు. 'సర్కారీ మిలిటెంట్లు' అని జనం పిలుచుకునే మాజీ మిలిటెంట్ల ముఠాల ఆగడాలు మోతాదు మీరినప్పుడల్లా 'వీరి ఆగడాలనింక క్షమించేది లేదు. వారిని అదుపు చేస్తాం' అని ప్రభుత్వ అధినేతలూ, పోలీసు అధికారులూ, సైనిక అధికారులూ ప్రకటిస్తుంటారు. కాని నిజంగా ఏం జరగదు. వాళ్ళు ఆయుధాలు పట్టుకుని తిరుగుతూనే ఉన్నారు కదా అని ఆ తరువాత ప్రభుత్వాన్నీ పోలీసులనూ అడిగితే 'వాళ్ళకు మిలిటెంట్ల నుండి ప్రాణభయం ఉంది, మరి వాళ్ళను మీరు కాపాడతారా?' అని మనల్నే ఎదురు ప్రశ్న అడుగుతారు.

ఆత్మరక్షణ పేరిట పట్టుకున్న తుపాకులతో వాళ్ళు వ్యాపారస్తులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారనీ, బలవంతపు పరిష్కారాలు చేస్తున్నారనీ అంటే 'కంప్లయింట్ ఇవ్వండి విచారిస్తాం' అంటారు. కానీ ఏం జరగదు. వాళ్ళు మళ్ళీ రోడ్లో తిరుగుతూనే ఉంటారు. మీరు ఇంకొక సారో, రెండు సార్లో ప్రభుత్వాన్ని, పోలీసులను అడుగుతారు. ఆ తరువాత ఇంక అడగడం మానేస్తారు. ఈ లైసెన్స్డ్ హంతకులను సమాజంలో భాగంగా మీరు కూడ అంగీకరించి అడ్జస్ట్ అయి బతకడం నేర్చుకుంటారు. కాశ్మీర్, అస్సాం, నాగాలాండ్ వంటి ప్రాంతాలు ఈ దశను ఇప్పటికే చేరుకున్నాయి. మిలిటెన్సీని ఎదుర్కోవడంలో ప్రభుత్వాలకు ఇప్పుడవి ఒక ప్రధాన సాధనం.

మనకింకా ఇది కొత్త కాబట్టి దొరగారూ, వారి ముఖ్యమంత్రిగారూ సభ్యసమాజం ఆశించే ప్రకటనలు చేస్తునారు. కొన్నాళ్ళకిది అలవాటయిపోయిన తరువాత ఆ బాధ కూడ ఉండదు. వాళ్ళను బహిరంగంగానే వాడుకోవచ్చు. వాళ్ళు పోలీసులకొక సాయుధ బలగం మాత్రమే కాదు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కూడ. తాము పని చేసి బయటికొచ్చిన ఉద్యమాన్ని గురించి వాళ్ళకు చాలా విషయాలు తెలుస్తాయి. ఆ జ్ఞానాన్ని ఆ

ఉద్యమాన్ని నాశనం చేయడానికి వాడడానికి వాళ్ళు సిద్ధంగా ఉన్నపుడు వారిని పోలీసులెందుకు పోగొట్టుకుంటారు? చట్టానికో, పాలనా నీతికో భయపడి పోగొట్టుకుంటే వారు తెలుగు పోలీసులే కారు.

ఈ క్రిమినల్ మాజీలెవ్వరికీ నక్సలైట్ల వల్ల ప్రాణభయం లేదని చెప్పడం నా ఉద్దేశం కాదు. ఆ భయం వాళ్ళు పోలీసు ఏజెంట్లుగా మారిన తరువాతే వచ్చిందనడం కూడ అందరి విషయంలోనూ నిజం కాకపోవచ్చు. కానీ, కారణమేమైనా ఆ భయం నుంచి తప్పించుకోవడానికి అప్పటిదాకా అనుక్షణం ద్వేషించిన రాజ్యానికి ఏజెంట్లుగా - సర్కారీ మిలిటెంట్లుగా - మారడాన్ని వారికి వారైనా ఏ విధంగా సర్ది చెప్పుకుంటారో! నక్సలైట్ ఉద్యమ దృక్పథంలో - ముఖ్యంగా పీపుల్స్ వార్ దృక్పథంలో - రాజ్యం పట్ల ద్వేషం ఒక ప్రధాన లక్షణం. ఆ పార్టీ కార్యకర్తలే కాదు, బయట ఉండే వారి సానుభూతిపరులైన బుద్ధిజీవులు సహితం ఏ విషయాన్ని విశ్లేషించినా 'రాజ్యాన్ని' కేంద్రం చేసి మాట్లాడుతుంటారు.

అటువంటి ఉద్యమం నుంచి బయటకొచ్చిన వారిలోనే 'రాజ్యం ఏజెంట్లు'గా తయారయ్యే వారు ఇంతమంది ఉండడం కొంచెం ఆశ్చర్యం కలిగించవలసిన విషయమే. పదేళ్ళ కింద ఇది ఊహకందని విషయం. నాలుగైదేళ్ళ నాడు గ్రీన్ టైగర్స్, క్రాంతిసేన వంటి పేర్లు మొట్టమొదట వినబడినప్పుడు అవి మఫ్టీ పోలీసుల బినామీలేనని, 'సర్కారీ మిలిటెంట్లు' పెద్ద సంఖ్యలో దొరికే పరిస్థితి ఇక్కడ లేదని అనుకున్నాం. ఆ నమ్మకమిప్పుడు పటాపంచలు అయింది. జిల్లాకొక ముఠా - నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, ఈ మధ్య మహబూనగర్ లో కూడ - తయారయ్యింది. తమలోనుండే ఆవిర్భవించిన ఈ క్రిమినల్ ముఠాల పైన ప్రతీకారం తీర్చుకోవడానికి పీపుల్స్ వార్ వంటి పార్టీలు సిద్ధంగానే ఉంటాయనడానికి సందేహమేమీ లేదు గానీ, వారెట్లా ఆవిర్భవించారని ఆలోచించడానికి అవి సిద్ధంగా ఉన్నాయా అనేది మాత్రం సందేహమే. తప్పు 'రాజ్యం' మీద పెట్టడంతోనే వారి విశ్లేషణ ముగుస్తుంది.

తప్పు ఎవరిదైనా కావచ్చుగానీ నష్టం మాత్రం అందరిదీ. పాలనా యంత్రాంగం రక్షణలో ఉన్న హంతకులు సమాజంలో యధేచ్ఛగా సంచరిస్తుండడం మిలిటెంట్ ఉద్యమాలకు మాత్రమే కాదు సమాజంలో అందరికీ హానికరం. ప్రజాస్వామ్యానికే హానికరం. ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహించేట్టు చేయగలిగితే - ఇది కేవలం నక్సలైట్లు, వారి సానుభూతిపరుల సమస్య కాదని ప్రజలకు చెప్పగలిగితే - పురుషోత్తం మరణం వృధా కాదు.

నీహార్ ఆన్లైన్.కాం<br>డిసెంబర్ 2000